PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :157 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం. 2306.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS

## గాంధీ సరోవర్‌కు..

# రక్షణ భూములు



### రాజ్‌నాథ్‌కు థ్యాంక్స్ చెప్పిన సీఎం రేవంత్

- ఆదిలాబాద్‌లో విమానాశ్రయం విస్తరణ
- కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కల్పించాలని వినతి
- సాయంత్రం రైల్వే మంత్రితో రేవంత్ కీలక భేటీ
- మెట్రో రుణ విడుదలపై కేంద్రం పెద్దలతో చర్చలు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా బాపూఘాట్ వద్ద చేపడుతున్న ప్రతిష్టాత్మక 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములను బదలాయించడంపై చర్చించారు. కేంద్రం నుంచి భూములు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినందుకు ముఖ్యమంత్రి రక్షణ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని వివరించారు. ఆదిలాబాద్ లో రానున్న భారతీయ వాయు సేన ఎయిర్‌పోర్ట్ ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరుపున హామీ ఇచ్చారు

#### కేంద్రమంత్రికి సీఎం పలు విజ్ఞప్తులు

భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని రక్షణ మంత్రిని కోరారు. ఇటీవల మధ్య ప్రాచ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

#### నిధులు, ప్రాజెక్ట్ లపై..

ఇది ఇలా ఉంటే రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోటా మరో 20 లక్షల టన్నులు పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేయనున్నారు. రైతులకు యూరియా కొరత రాకుండా ముందస్తు సరఫరా కోరనున్నారు. రామగుండం యూరియా ఉత్పత్తి మొత్తాన్ని తెలంగాణకే కేటాయించాలని విజ్ఞప్తి చేయనున్నారు. రాయదుర్గం భూముల వ్యవహారంలో ఎస్‌బీఐ తీరుపై కేంద్రానికి ఫిర్యాదు చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్బీఐ గవర్నర్ దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లనున్నారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పులపై హైకమాండ్‌తో చర్చించే అవకాశాలు ఉన్నాయి.

#### కిషన్ రెడ్డి సమక్షంలో రైల్వే మంత్రితో..

మెట్రో ఫేజ్ 1 రీఫైనాన్సింగ్ వివాదంపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకునేందుకు సీఎం సిద్ధమయ్యారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణ సమస్యలపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో సోమవారం సాయంత్రం రేవంత్ సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. ఐఆర్‌ఎఫ్సీ లోన్ విడుదల జాప్యంపై ఈ భేటీలో రేవంత్ చర్చించనున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ సహా మెట్రో విస్తరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురానున్నారు.



## ఆర్డీఎస్‌లో తెలంగాణ నీటి వాటాపై రాజీ లేదు: మంత్రి ఉత్తమ్ కుమార్




హైదరాబాద్, ప్రభాత సూర్యుడు తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు.

## 30 నెలల్లో వినాశనం.. చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ: కేటీఆర్

హనుమకొండ, జూన్ 22 ప్రభాత సూర్యుడు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్‌ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు.

## అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం కలచివేసింది: మోదీ

### లక్నో అగ్నిప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి.. సహాయక చర్యలకు ఆదేశాలు




ఢిల్లీ, ప్రభాత సూర్యుడు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని అలీగంజ్ ప్రాంతంలో కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. "లక్నో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం కలగడం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. సహాయక చర్యలు కొనసా గుతున్నాయి. బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తున్నారు" అని ప్రధాని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మూడు అంతస్తుల భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో భవనంలో ఉన్న పలువురు విద్యార్థులు మంటలు, దట్టమైన పొగ మధ్య చిక్కుకుపోయారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్ ప్రతీక్ జైన్



జూన్ 22 ప్రభాత సూర్యుడుసంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు! ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.


## అన్నారంలో : రోడ్డు మరమ్మత్తులు చేపట్టండి



జూన్ 22 ప్రభాత సూర్యుడుగుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి అన్నారం-జంగంపేట్ వెళ్ళు రహదారి పూర్తిగా ధ్వంసమై హీనస్థితిలో ఉంది.ఎవరైనా గర్భిణీ మహిళలకు గాని మరి ఏదైనా ప్రమాదవశత్తు రోడ్డు ప్రమాదం జరిగినతో అత్యవసరంగా ఎక్కడికైనా తీసుకెళ్లాలని కూడా ఆ దారి గుండా వెళ్లాలంటే జనాలు జంకుతున్నారు! అలాగే చిన్నప్పటి వర్షానికి రోడ్డు మొత్తం గుంతల మయంగా ఉండి అందులో నీరు చేరి ఎంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచు ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గుమ్మడిదల మండల భారతీయ జనతా పార్టీ జనరల్ సెక్రెటరీ తుజల్పుర్ రాజు సందర్భంగా కోరారు.

## గుమ్మడిదల: సుందరి కరుణ పనులు నిలిపివేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

జూన్ 22 ప్రభాత సూర్యుడు: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం



దోమడుగు నల్లచెరువు సుందరీకరణ పనులు నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం నాడు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ఆరోపిస్తూ ఓ కార్పొరేట్ పరిశ్రమ దోమడుగు గ్రామానికి మరియు స్థానిక ప్రజలకు పూర్తిగా అన్యాయం చేసిందని చెప్పేసి, ఆ పరిశ్రమ నుండి అనేక రకమైన వ్యర్థ రసాయనాలు, జల రసాయనాలు, ఆ యొక్క నల్లకుంట చెరువులోకి చేరి భూగర్భ స్థానాన్ని పూర్తిగా నాశనం చేసి ప్రజలకు, వృద్ధులకు,గర్భిణీలకు వింత వింత అనారోగ్యానికి గురి అవుతూ కుష్టి రోగాలతో ఎంతో బాధ అనుభవిస్తున్నామని చెప్పేసి గత మున్సిపల్ ఎలక్షన్ల ముందే దోమడుగు ప్రధాన రహదారి పైన వీధుల గుండా ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేసినప్పటికీ పొల్యూషన్ డిపార్ట్మెంట్ కి వెళ్లి ఫిర్యాదు చేసిన వాళ్లు కూడా ఆ పరిశ్రమనే అని పూర్తి నివేదిక ఇచ్చిన కూడా ఇప్పుడు స్థానిక మున్సిపల్ పాలకవర్గంతో కలిసి ఆ యొక్క పరిశ్రమ సుందరీ కర్ణ పేరుతో దోమడుగు ప్రజల అభిప్రాయం స్వీకరించకుండా ఏకాదాటిగా ఈ యొక్క పనులను కొనసాగిస్తుందని చెప్పేసి ఈ యొక్క కార్పొరేట్ పరిశ్రమ సుందరికరుణ పనులతో కొత్త తెర లేపి దోమడుగు గ్రామస్తులను తప్పుదోవ పట్టిస్తుందని, చెప్పేసి వెంటనే జిల్లా కలెక్టర్ ఈ యొక్క విషయంపై జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని జిల్లా మెజిస్ట్రేట్ ను గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బాల్ రెడ్డి, మంగయ్య, ఐలేష్, రాఘవరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల మహిళా కార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదిరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణకు బీఎల్ఓలకు శిక్షణ

**- ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి: ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి**

బడంగ్‌పేట్, జూన్ 22 (ప్రభాత సూర్యుడు):ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేకు సంబంధించిన బూత్ లెవల్ అధికారులకు (బియల్ఓ) సోమవారం బడంగ్‌పేట్ సర్కిల్-16 కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, ఇంటింటి సర్వే విధానం, అర్హులైన ఓటర్ల గుర్తింపు, కొత్త



ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన మరియు డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలన వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్ఓల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో/ఈఆర్వో ఎన్. జగదీశ్వర్ రెడ్డి, బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్/ఏఈఆర్వో వి. సమ్మయ్య మాట్లాడుతూ..ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి సరైన సమాచారం సేకరించడం ద్వారా అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్ఓల బాధ్యత అత్యంత ముఖ్యమని వారు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ నరేష్, మాస్టర్ ట్రైనర్లు ఆనంద్ కుమార్, చైతన్య కుమార్, ప్రతాప్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.23న రాజకీయ పార్టీల బీఎల్ఏల సమావేశంసర్ కార్యక్రమానికి సంబంధించి బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం జూన్ 23న ఉదయం 11 గంటలకు సర్కిల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రజాభవన్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

# లష్కర్‌గూడ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలి

**- ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలే ముఖ్యమా**
**- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 22 (ప్రభాత సూర్యుడు):అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడ, సుర్మాయిగూడ, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, గుంతపల్లి, గండిచెరువు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి లష్కర్‌గూడ బ్రిడ్జి వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. లష్కర్ గూడ



మాజీ యంపిటిసి సీక సాయి కుమార్ గౌడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ బ్రిడ్జి సమస్యను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి రూ. 6.40 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా శిలాఫలకం కూడా ఆవిష్కరించారని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు ప్రజా సమస్యల పరిష్కారం కంటే మంత్రతి పదివిపైనే ఎక్కువ ఆసక్తి కనిపిస్తోందని ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసేలోపు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. గతంలో ఇదే బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో కారు నీటిలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందిన ఘటనను గుర్తు చేశారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి, పూజారి చక్రవర్తి గౌడ్, ఇనాంగూడ సర్పంచ్ రాఘవేందర్, మాజీ సర్పంచ్ లు చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, తుడుం మల్లేష్, సురకంటి శ్రీనివాస్ రెడ్డి, రాచపాక మహేష్, మొగుళ్ళ జీవన్ రెడ్డి, కర్రి లింగస్వామి (లింగం), బిఎస్పి నాయకులు యంజాల ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ జూనియర్ కాలేజీని సీజ్ చేయాలి

**- జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతిపత్రం**

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 22 (ప్రభాత సూర్యుడు):పెద్ద అంబర్‌పేట్‌లో నిర్వహిస్తున్న వీఆర్ జూనియర్ కాలేజీపై తక్షణ చర్యలు తీసుకుని సీజ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే.వై. ప్రణయ్ మాట్లాడుతూ.. వీఆర్ జూనియర్ కాలేజీకి ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల ప్రాంగణంలోనే పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తూ విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో యాజమాన్యం





చెలగాటమాడుతోందని విమర్శించారు. వినతిపత్రంపై స్పందించిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఓ) సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సమక్షంలో హామీ ఇచ్చారని ప్రణయ్ తెలిపారు. దీనిపై అధికారులు స్పందించకపోతే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, నాయకులు శ్రీకాంత్, తరంగ్, అరుణ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.



## జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 22 (ప్రభాత సూర్యుడు):అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం మధ్యాహ్నం కాలనీలోని బ్లాక్ నంబర్-26 సమీపంలోని నూతన డబుల్ బెడ్‌రూం భవనాల వద్ద ఓ వ్యక్తి మృతదేహం కనిపించినట్లు సమాచారం అందడంతో అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సమాచారం మేరకు సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం అర్ధ కుళ్లిన స్థితిలో లభించింది. మృతుడు తెలుపు రంగు టీ-షర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం పరిస్థితిని బట్టి మూడు రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.



## వైద్యాధికారుల హాజరుపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం జూన్ 23 ప్రభాత సూర్యుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధి నిర్వహణ, ప్రధాన కార్యాలయ హాజరు మరియు సేవల అందజేతపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది విధిగా ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని, విధి సమయాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇటీవల జరిగిన మాతృ మరణ ఘటనల నేపథ్యంలో ప్రతి వైద్యాధికారి మరింత బాధ్యతతో పనిచేయాలని, గర్భిణీల పర్యవేక్షణ, అత్యవసర వైద్య సేవలు, రెఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ తుకారం రాథోడ్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు , సమయపాలన పాటించని వైద్యాధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జిల్లా వైద్య ఒ ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అందరు కలెక్టర్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, జిల్లాలో అన్ని ఆరోగ్య సంస్థల్లో హాజరు, సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐతీ తుకారాం రాథోడ్ ఐవీనా, జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు , పాల్గొన్నారు

## కారేపల్లిలో ఆదివారం రాత్రి చోరీ.

**ఐదు తులాల బంగారం అపహరణ**



సింగరేణి జూన్ 22 ప్రభాత సూర్యుడ్. కారేపల్లిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కేతిమళ్ళ సారయ్య కుటుంబం ఇంటి బయట నిద్రిస్తున్నారు. ఇంటి వెనకాల తలుపు వేయటంలో అదమరవటంతో దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో బీరువాకే తాళ్లం చేవి ఉండటంతో బీరువా తీసిన దుండగులు దుస్తులలో ఉన్న లాకర్ తాళం తీసి దానిలో ఉన్న ఉంగరాలు, చెవు కమ్మలు, చిన్న గొలుసులను సుమారు 5 తులాలను అపహరించారు. ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లగా బీరువా తెరిచి ఉండటం దానిలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో దొంగతనంగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్ ఎస్ ఆర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా డే.

నెల్లూరు,జిల్లా,కడనూతల ప్రభాత సూర్యుడుకడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఈసీఈ డిపార్ట్మెంట్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 30 సంవత్సరాలకు పైగా అపార అనుభవం గల యోగా గురువు టి. శ్రీరామచంద్రమూర్తి పాల్గొని ఆర్ ఎస్ ఆర్ అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందిచే యోగాసనాలు మరియు ప్రాణాయామం చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ యోగాసనాలు ప్రాణాయామం ప్రతిదినము చేసినట్లయితే సర్వరోగ నివారణగా తోడ్పడుతుందని, అలాగే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగటంతో పాటు ప్రశాంతమైన, నిష్కమలమైన ఆలోచనలతో తోటి వారితో ప్రవర్తించడానికి తోడ్పడుతుందని, అలాగే ఎలాంటి చెడు వ్యసనాలకు గురికాకుండా అహింస మార్గంలో నడుచుటకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్ వి రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ. మాల్యాద్రిరెడ్డి, ఈ సి ఈ ఇంచార్జ హెచ్ ఓ డి కే. శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ. కిరణ్ కుమార్ అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# అశ్వారావుపేట బీఆర్ఎస్‌లో 'కులాధిపత్య' చదరంగం!

### వర్గపోరుతో నట్టేట మునుగుతున్న కారు.. 'హరీష్ రావు' ఎంట్రీతోనైనా మారేనా?

అశ్వారావుపేట జూన్ 22 ప్రభాత సూర్యుడునియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో రాజకీయ చదరంగం పతాక స్థాయికి చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని అనుకూలంగా మార్చుకుని, ప్రజా సమస్యలపై పోరాడాల్సిన గులాబీ నేతలు.. స్వయంకృతాపరాధంతో పార్టీని అగాధంలోకి నెడుతున్నారు. అశ్వారావుపేట మండలంలో పార్టీ పరిస్థితి "నాదంటే నాదే పైచేయి" అన్న చందంగా తయారైంది. చౌదరి, రెడ్డి, ఆర్యవైశ్య గ్రూపులుగా విడిపోయిన నాయకత్వం.. తమ వ్యక్తిగత ఇగోల కోసం పార్టీ ప్రతిష్టను బజారున పడేస్తోందని క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ నడుస్తోంది.?ప్రజా సమస్యలు గాల్లోకి.. ఫంక్షన్లకే పరిమితమైన నేతలు!?అధికారం కోల్పోయిన తర్వాతనైనా ప్రజల పక్షాన నిలబడి క్యాడర్‌లో జోష్ నింపాల్సిన పెద్దలు.. కేవలం పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఫంక్షన్ల చుట్టూ తిరగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గళమెత్తే నాథుడే కరువయ్యాడు.?అటు మాజీ ఎమ్మెల్యే నాయకత్వం, ఇటు మాజీ ఎమ్మెల్యే నాయకత్వం అంటూ గ్రూపులుగా విడిపోయి ఊరేగుతున్నారు తప్ప.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే వ్యూహం ఎవరికీ లేదు. నాయకుల వర్గపోరు చూస్తుంటే అసహ్యం వేస్తోంది" అని గులాబీ జెండాను నమ్ముకున్న సామాన్య కార్యకర్తలు తీవ్ర ఆసహనం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ?గ్రూపు తగాదాలతో కాంగ్రెస్‌కు 'లైఫ్ లైన్'.. ముందుంది గడ్డుకాలం!?నిజానికి రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ప్రజలకు దూరం అవుతోంది. ఆ అసంతృప్తిని క్యాష్ చేసుకుని, బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాల్సిన సువర్ణావకాశం బీఆర్ఎస్‌కు ఉంది. కానీ, ఇక్కడి నాయకులు మాత్రం కులాలుగా విడిపోయి పార్టీని నట్టేట ముంచుతున్నారు. ఈ అంతర్గత కోరపాట్లు ఇలాగే కొనసాగితే.. రాబోయే కాలంలో పార్టీకి ఘోరమైన గడ్డుకాలం తప్పదని, రాష్ట్ర నాయకత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే అశ్వారావుపేటలో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.?ఆశలన్నీ 'ట్రబుల్ షూటర్' పైనే.. హరీష్ రావు రాకతో సమన్వయం కుదిరేనా??ఈ సంక్షోభ సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ట్రబుల్ షూటర్ తన్నీరు హరీష్ రావు అశ్వారావుపేట నియోజకవర్గంలో పర్యటించబోతున్నారనే వార్త ఇప్పుడు స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. హరీష్ రావు రాకతోనైనా ఇక్కడి స్థానిక నాయకులు తమ పంతాలు, పట్టింపులను పక్కనబెట్టి సమన్వయంతో నడుచుకుంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు.?ఆ నోట ఈ నోట వినబడుతున్న ప్రజా సంభాషణల ప్రకారం.. హరీష్ రావు లాంటి సీనియర్ నేత ఇక్కడి గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టి, నాయకులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేస్తారని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. మరి హరీష్ రావు ఎంట్రీతోనైనా ఈ 'కులాధిపత్య చదరంగానికి' తెరపడుతుందా? అయోమయంలో ఉన్న క్యాడర్‌లో కొత్త జోష్ నిండుతుందా? లేదా అనేది వేచి చూడాలి.




# జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

### షెడ్యూల్డ్ ప్రాంత షెడ్యూల్డ్ కులాల రైతులకు ఆన్లైన్ ఎరువుల విధానం ఎత్తివేయాలి
### అటవీ హక్కుల చట్టం ఆధారంగా ఎస్సీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్










కొత్తగూడెం జూన్ 23 ప్రభాత సూర్యుడుషెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతుల ధర్మ పోరాట నిరసన ధర్నా జరిగింది. ధూమ్ దాం రాము కళాబృందం పాటలతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అధ్యక్షతన వహించారు. ఎస్సీ రైతుల పోరాటానికి మద్దతుగా సంఘీభావం తెలపడానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా, సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకులు పావులూరి మధు,తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంతెన వసంతరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మింతెన వసంతరావు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు గుండాల సర్పంచ్ కోరం సీతారాములు,తుడుం దెబ్బ నాయకులు గోవిందు నరసింహారావులు మద్దతు తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతులకు తరతరాల నుండి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి నుండి పట్టా పుస్తకాలు లేని కారణంగా ఎస్సీ రైతులు అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. ఎరువులు ధాన్యం ఆన్లైన్ విధానం ఎత్తివేయాలని కోరారు. ఎస్సీ రైతులకు ఈ కొత్త విధానాన్ని విరమించుకొని పాత పద్ధతిలో మాన్యువల్ ఫహానిల ద్వారా బ్యాంకుల వద్ద రుణాలు ఇచ్చి అన్ని విధాల ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే దృష్టి సారించి షెడ్యూల్డ్ ప్రాంత షెడ్యూల్డ్ కులాలకు ఏజెన్సీ ప్రాంత చట్టాల పేరుతో అభివృద్ధికి దూరమైనారని ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు ఒక న్యాయం మైదాన ప్రాంత ఎస్సీలకు మరొక న్యాయమా అని నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్, గౌరవ సలహాదారు సెనగ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్,రాష్ట్ర నాయకులు గాంధర్ల నిత్యానందం,మెంతెన కొండలరావు,వేల్పుల భాస్కర్ ముచ్చ సుధాకర్,జిల్లా నాయకులు కర్లపూడి సుందర్ పాల్,బొమ్మెర నాగేష్,సత్యం,ఎనగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన

ఖమ్మం, జూన్ 22 ప్రభాత సూర్యుడుఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. అనంతరం జగనాధపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



# రైతు మేళా, ముఖ్యమంత్రి సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి... జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్




ఖమ్మం, జూన్ 22 ప్రభాత సూర్యుడుజూన్ 28, 29 తేదీలలో నిర్వహించే రైతు మేళా, జూన్ 30న మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి కలెక్టర్, చింతకాని మండలంలోని సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమం కోసం భారీ స్థాయిలో సిబ్బందిని వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్, చింతకాని తహసీల్దార్‌లు సభా స్థలాన్ని పూర్తిస్థాయిలో క్లియర్ చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. సభ నిర్వహణ కోసం మొత్తం 25 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేయాలని, అందులో 20 ఎకరాలను బహిరంగ సభకు, 5 ఎకరాలను ప్రదర్శన స్టాల్స్ కోసం కేటాయించాలని సూచించారు. అదనంగా వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జూన్ 28, 29 తేదీలలో రైతు మేళా, జూన్ 30న ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సుమారు 150 స్టాల్స్ ఏర్పాటు చేయాలని, రైతులతో చర్చించి వాటి స్థలాన్ని ఖరారు చేయాలని తెలిపారు. వేదికను ఏర్పాటు చేసి సమావేశ లేఅవుట్ రూపొందించాలని ఆదేశించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని, రెండు ప్రాంతాలకు వేర్వేరుగా ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం రోజు సరైన పార్కింగ్, కార్యక్రమ అనంతరం సక్రమంగా తిరిగి పంపించడం వరకు లైజన్ అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. మూడు రోజుల కార్యక్రమాలకు ఆహారం, త్రాగునీటి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. స్టాల్ సిబ్బంది, శిక్షణ సిబ్బంది, విధుల్లో ఉండే ఉద్యోగులకు ప్రత్యేక ఆహార కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం రోజున బస్సుల సమయాలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమం ప్రారంభం, ముగింపు సమయంలో నాణ్యమైన ప్యాకెట్ భోజనం అందించాలని తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ భూమి లెవెలింగ్, అవసరమైన బ్యారికేడింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసుకొని ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందాన్ని ఖరారు చేయాలని, ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్‌లు ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, సభా ప్రాంగణంలో ప్రతి 250 మందికి ఒక బాధ్యుడిని నియమించి నీటి పంపిణీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. స్టాల్స్, ప్రదర్శన ప్రాంతాల వద్ద కూడా త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రతి వ్యయాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని, అన్ని ఖర్చులు ఆడిట్‌కు లోబడి ఉంటాయని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యక్రమం ముగిసిన అనంతరం ప్రైవేట్ స్థలాలను పూర్తిగా శుభ్రపరిచి యథాతథ స్థితిలో తిరిగి అప్పగించాలని ఆదేశించారు. వేదిక నిర్వహణకు ఆర్డీవోను ఇన్‌చార్జిగా నియమించి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రాలు పంపించాలని, డీఆర్ఓ జిల్లా స్థాయి ప్రోటోకాల్ ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అన్ని భద్రతా అంశాలను పరిశీలించాలని, సమాచార పౌర సంబంధాల శాఖ ఆడియో, వీడియో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించారు. వేదికపై అతిథులకు అల్పాహారం, భోజన ఏర్పాట్ల కోసం ప్రత్యేక ప్రోటోకాల్ బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన డ్యూటీ పాసులు, వాహన పాసులు సిద్ధం చేసి, ఏ పాస్‌కు ఎక్కడి వరకు ప్రవేశం ఉంటుందో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. అవసరానికి 10 శాతం అదనపు పాసులు ముద్రించి సిద్ధంగా ఉంచాలని, కార్యక్రమానికి 48 గంటల ముందు తుది జాబితాను ఖరారు చేసి పోలీసు శాఖకు అందించాలని సూచించారు. విద్యుత్ శాఖ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన బ్యాకప్ ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందిని పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమానికి వినియోగించాలని కలెక్టర్ ఆదేశించాం. నగర పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గుర్తించిన స్థలాన్ని పూర్తి స్థాయిలో లెవెలింగ్ చేయాలని, పార్కింగ్ ప్రాంతాలకు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌తో పాటు మంత్రులు కూడా హెలికాప్టర్ల ద్వారా వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు వేర్వేరు హెలిప్యాడ్ ప్రదేశాలను గుర్తించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సభా ప్రాంగణానికి వెళ్లే అన్ని రహదారులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాల తొలగింపు, చెట్ల తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వేదిక సిబ్బంది, బ్యాక్ స్టేజ్ సిబ్బంది విధుల జాబితాలను ప్రత్యేకంగా సిద్ధం చేసి ముందుగానే పోలీసు శాఖకు అందించాలని కమీషనర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ విద్యపై సమీక్ష జరుపండి ప్రాజెక్ట్ అధికారికి మెమోరాండం

### ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
### ఏజెన్సీ విద్యను బలోపేతం చేయండి
### బాలకార్మికుల తయారీ కేంద్రాలుగా ఏకోపాధ్యాయ పాఠశాలు
### నేటికీ అడవికి చేరని అక్షరం

ములుగు జూన్ 22, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా ఏటూరునాగారం సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పోను కలిసి ఏజెన్సీ విద్యలోని లోపాలపై, సమస్యల పై సమగ్ర మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా ఏజెన్సీ విద్య ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారుదేశానికి స్వాతంత్ర్యం వచ్చి శతాబ్దానికి చేరువవుతున్నా తెలంగాణ ఏజెన్సీలోని అడవి బిడ్డలకు నేటికీ నాణ్యమైన విద్య అందడం లేదని, ఇది ఆదివాసీలకు జరుగుతున్న చారిత్రక అన్యాయమని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఎస్ఈఆర్ నివేదికతో వెల్లడైన దుస్థితి "-ఏ ఎస్ఈఆర్ 2024 నివేదిక ప్రకారం 5వ తరగతి విద్యార్థుల్లో 61 శాతం మందికి 2వ తరగతి తెలుగు పాఠం చదవడం రాదు. 71 శాతం మందికి సాధారణ తీసివేతలు చేయడం రావడం లేదు. పై తరగతులకు వెళ్లే కొద్దీ గిరిజన విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేటు పెరిగిపోతోంది. కనీస అభ్యసన సామర్థ్యాలు పూర్తిగా లోపించాయి" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ బడులు బాలకార్మిక కేంద్రాలుగా ఐటీడీ ఏ పరిధిలోని 194 గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో 89 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలేనని నర్సింహా మూర్తి తెలిపారు. "ఒక్క టీచర్ మీటింగ్‌కు వెళ్తే ఆ రోజు పాఠశాల మూతపడుతోంది. నెలలో 6 నుండి 8 రోజులు బడి నడవని పరిస్థితి. ఇవి బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ కేంద్రాలుగా మారాయి" అని ఆయన ఆరోపించారు. 14 ఏళ్లుగా నియామకాలు లేవు 2012 తర్వాత ఐటిడిఏ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు జరగలేదని, ప్రస్తుతం 417 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. "సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో 8, 9, 10 తరగతుల్లో సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ బోధన అసలే జరగడం లేదు. వెంటనే కాంట్రాక్ట్/ సిఆర్టి విధానంలో పోస్టులు భర్తీ చేయాలి" అని డిమాండ్ చేశారు. అంతా అక్షరాస్యులే ఐటీడీ ఏ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 1,20,000 ఖర్చు చేస్తోంది. కానీ పిల్లలను అక్షరాస్యులుగా మాత్రమే చేస్తున్నారు, విద్యావంతులుగా కాదు. అక్షరాస్యత కోసం ఇంత ఖర్చు అవసరం లేదు, రాత్రి బడికి వెళ్లినా సరిపోతుంది" అని ఆయన ఎద్దేవా చేశారు. 80 శాతం రక్త హీనత ఐటీడీ ఏ పరిధిలో సుమారు 80 శాతం మంది విద్యార్థులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారని, సరైన పోషకాహారం అందక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. "వీరికి వారానికి 3 సార్లు గుడ్లు, 2 సార్లు చికెన్, రోజూ రాగిజావ, ఆకుకూరలతో కూడిన ప్రత్యేక మెనూ అమలు చేయాలి" అని కోరారు. పర్యవేక్షణ శూన్యం ఏ టి డి ఓ , టీటీడీఓ , డీడీ వంటి అధికారులు ఉన్నప్పటికీ ఐటీడీ ఏ పాఠశాలలను పర్యవేక్షించే సమయం వారికి లేదని ఆరోపించారు. కొంతమంది ఉపాధ్యాయులు వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ పని దినాల్లో బయట తిరుగుతున్నారని, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తూ పేద ఆదివాసీ బిడ్డలకు అన్యాయం చేస్తున్నారని పిఓ దృష్టికి తీసుకెళ్లారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను వెంటనే రద్దు చేసి అదనపు టీచర్‌ను నియమించాలని, 417 ఖాళీ పోస్టులను 3 నెలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో 100 శాతం స్థానిక ఎస్టి అభ్యర్థులతో భర్తీ చేయాలని, బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పనిదినాల్లో కొంతమంది ఉపాధ్యాయులు బడి బయట తిరుతున్నారని అలాంటి వారిని ఉపేక్షించరాదు అన్నారు.






# దీపికా పదుకొణే దెబ్బకి హీరోలే ఎగ్జిట్!

బాలీవుడ్ చిత్రం –కాక్ టెయిల్– ఎలాంటి విజయం అందుకుందో తెలిసిందే. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన రొమాంటిక్ డ్రామా బాక్సాఫీస్ భారీ వసూళ్లను సాధించింది. బాలీవుడ్ చిత్రం –కాక్ టెయిల్– ఎలాంటి విజయం అందుకుందో తెలిసిందే. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన రొమాంటిక్ డ్రామా బాక్సాఫీస్ భారీ వసూళ్లను సాధించింది. ముఖ్యంగా అప్పటి యూత్ ని ఫిదా చేసిన చిత్రమిది. ముఖ్యంగా చిత్రంలో దీపికా పదుకొణె పోషించిన వెరోనికా పాత్ర అమ్మడి కెరీర్‌లోనే ఓ మైలురాయిగా నిలిచిపోయింది. అయితే అదే పాత్ర కారణగా ఇద్దరు స్టార్ హీరోలు కూడ ఈ చిత్రాన్ని రిజెక్ట్ చేసారు? అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని స్వయంగా అందులో నటించిన సైఫ్ అలీ ఖాన్ రివీల్ చేసారు. ఇందులో హీరో (గౌతమ్) పాత్ర కోసం తొలుత సైఫ్ అలీ ఖాన్‌ను అనుకోలేదట. ఆ సమయంలో




బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ యంగ్ హీరోలుగా దూసుకుపోతున్న రణబీర్ కపూర్ –ఇమ్రాన్ ఖాన్‌లను ఈ పాత్ర కోసం సంప్రదించారట. కథ విన్న తర్వాత ఇద్దరు ప్రాజెక్ట్‌లో నటించడానికి నిరాకరించారు. రణబీర్, ఇమ్రాన్‌లు ఈ సినిమాను తిరస్కరిం చడానికి ప్రధాన కారణం దీపికా పదుకొణె పోషించిన వెరోనికా పాత్రేనని సైఫ్ తెలిపారు. కథ మొత్తం ఆ మహిళా పాత్ర చుట్టూనే తిరుగుతుందని.. సినిమాలో హీరో కంటే ఆ పాత్రకే ఎక్కువ ప్రాధాన్యత.. స్క్రీన్ స్పేస్ ..అద్భుతమైన ఎమోషన్స్ పండించే అవకాశం ఉందని భావించారుట. దీంతో మాట ఇచ్చి సినిమాలో నటించడం కంటే ఛాన్స్ వదులుకోవడమే ఉత్తమమని ఎగ్జిట్ అయినట్లు సైఫ్ తెలిపారు. యువ హీరోలు నో చెప్పడంతో ఆ పాత్రను వేరే ఎవరితోనైనా చేయించడం కంటే తానే స్వయంగా నటించాలని సినిమాకు నిర్మాత కూడా అయిన సైఫ్ అలీ ఖాన్ రంగంలోకి దిగారు. అప్పటికే సీనియర్ అయిన సైఫ్ కథలో హీరోయిన్ పాత్రకున్న ప్రాధాన్యతను గౌరవిస్తూ ఆ పాత్రను చేయడానికి అంగీకరించారు. సినిమా విడుదలయ్యాక సైఫ్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. కానీ కథ ప్రకారం అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం దీపికా పదుకొణె పాత్రే కావడం విశేషం. సినిమాలో పశ్చాత్తాపం, ప్రేమ, స్నేహం, మానసిక సంఘర్షణ వంటి విభిన్న భావోద్వేగాలను ఆమె అద్భుతంగా పండించింది. ఈ సినిమాతో దీపికకు బాలీవుడ్ లో మంచి పేరొచ్చింది. నటిగా మరింత బిజీ అయింది. ఈ చిత్రానికి సీక్వెల్ గా –కాక్ టెయిల్ 2– కూడా తెరకెక్కింది. ఇటీవలే ఈ చిత్రం రిలీజ్ అయింది. ఇందులో షాహిద్ కపూర్ ,చ కృతిసనన్, రష్మికా మందన్నా నటించారు. కానీ ఈ సినిమా అనుకున్నంతగా సక్సెస్ అవ్వవలేదు.

# తానొకటి తలచిన.. అన్‌లక్కీ తెలుగమ్మాయ్ తెరవెనక కథ!



అయితే గ్లామర్ పరిశ్రమలో ప్రతిభ ఎంత ఉన్నా.. అదృష్టం కూడా కలిసిరావాలనే దానికి రీతూ వర్మ కెరీర్ ఒక ఉదాహరణ. –పెళ్లి చూపులు– లాంటి క్లాసిక్ బ్లాక్‌బస్టర్ తో సోలో హీరోయిన్‌గా కెరీర్‌ను టేకాఫ్ చేసుకుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. అంతకుముందు కొన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా –పెళ్లి చూపులు– తెచ్చిన గుర్తింపే వేరు! ఓవర్ నైట్ స్టార్ డమ్ పెంచిన చిత్రమిది. ఆ తర్వాత దుల్కర్ సల్మాన్, చియాన్ విక్రమ్, గోపీచంద్ లాంటి క్రేజీ ..అగ్ర హీరోల సరసన వరుసగా అవకాశాలను అందుకుంది. అయితే గ్లామర్ పరిశ్రమలో ప్రతిభ ఎంత ఉన్నా.. అదృష్టం కూడా కలిసిరావాలనే దానికి రీతూ వర్మ కెరీర్ ఒక ఉదాహరణ. నటిగా ఎదిగే క్రమంలో.. కమర్షియల్ సినిమాలతో సత్తా చాటుతూ దూసుకెళ్లాల్సిన సమయంలో తన కెరీర్ గురించి ఎంత పెద్దగా ఊహించుకుందో.. అందుకు అతీతంగా దురదృష్టవశాత్తూ కొన్ని దెబ్బలు పడ్డాయి. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ – స్టార్ డైరెక్టర్ గౌతమ్ మీనన్ కాంబినేషన్‌లో వచ్చిన –ధృవనక్షత్రం– తన కెరీర్ గేమ్ ఛేంజ్ చేస్తుందని ఆశించింది. కానీ అలాంటి అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కినా అది కలిసి రాలేదు. తన కెరీర్‌ను అంతర్జాతీయ స్థాయికి రీడిఫైన్ చేసేంత గొప్ప ప్రతిభావంతులతో పనిచేసే ఛాన్స్ వచ్చినా దురదృష్టవశాత్తూ ఆ సినిమా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడటం, రిలీజ్ ఏళ్ల తరబడి ఆలస్యం అవ్వడం ఈ తెలుగమ్మాయిని వేధించింది. ఇంతటి క్రేజీ సినిమాలో భాగమయ్యాక కూడా అది ప్రేక్షకులకు దూరం అవ్వడాన్ని రీతూ జీర్ణించుకోలేని దుస్థితి ఏర్పడింది. అయినా.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా రీతూ వర్మ మొక్కవోని దీక్షతో తన పంథాలో ముందుకు సాగుతోంది. నటిగా కెరీర్ పరంగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన సినిమాలను ఎంచుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ సరసన భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న –భరతవర్ష– సాగా ఆఫ్ షులా– అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై రీతూ వర్మ చాలా హోప్స్ పెట్టుకుంది. కెరీర్‌లో తప్పనిసరిగా ఒక భారీ హిట్ పడాల్సిన అత్యంత కీలకమైన సమయంలో ఈ హిస్టారికల్ డ్రామాలో భాగం కావడం విశేషం.జాతీయ అవార్డు గ్రహీత, వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న –భరతవర్ష– సాగా ఆఫ్ షులా– సినిమా కథాంశం భారతదేశ ప్రాచీన కాలం, చారిత్రక యుద్ధాల నేపథ్యంతో ముడిపడినది. కమర్షియల్ హంగులతో పాటు అద్భుతమైన విజువల్స్, అప్పటి సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యంలో ఒక యోధుడి కథగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా గోపీచంద్ కెరీర్‌కు పూర్తి వైవిధ్యమైనది.. ఎందుకంటే అతడు తన రెగ్యులర్ మాస్ ఇమేజ్‌ను పక్కనబెట్టి రాజుల కాలం నాటి ఒక సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. అటు సంకల్ప్ మార్క్ మేకింగ్, ఇటు గోపీచంద్ యాక్షన్ ఎలిమెంట్స్ ఈ సినిమాను ఇద్దరి కెరీర్‌కు ఎంతో ప్రత్యేకంగా మార్చబోతున్నాయి. ఈ చారిత్రక కథాంశంలో నటిగా తనను తాను నిరూపించుకోవడానికి రీతూ వర్మకు చాలా ఎక్కువ స్కోప్ ఉంది. కేవలం ఒక సాదాసీదా హీరోయిన్ పాత్రలా కాకుండా... కథను మలుపు తిప్పే బలమైన, రాచరికపు లేదా చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత్రలో తను కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. సంకల్ప్ రెడ్డి సినిమాల్లో మహిళా పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి... రీతూ వర్మ తన నటనతో మరోసారి మెప్పించే వీలుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే అన్‌లక్కీ హీరోయిన్ అనే ముద్రను చెరిపేసి రీతూ వర్మ దక్షిణాదిన మళ్లీ ఒక రేంజ్‌లో బిజీ అవ్వడం ఖాయం.

# బోయ్‌ఫ్రెండ్ మ్యాటర్‌లో దాపరికం లేని యంగ్ హీరోయిన్‌లు









బాలీవుడ్ లో ఒకప్పుడు హీరోయిన్లు తమ వ్యక్తిగత జీవితాలను.. ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలను అత్యంత రహస్యంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. బాలీవుడ్ లో ఒకప్పుడు హీరోయిన్లు తమ వ్యక్తిగత జీవితాలను.. ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలను అత్యంత రహస్యంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. పెళ్లి లేదా ఎంగేజ్‌మెంట్ వరకు తమ రిలేషన్‌షిప్స్ గురించి నోరు విప్పేవారు కాదు. కనీసం కొన్ని నెలలు లేదా సంవత్సరాలు రహస్యంగా దాగి ఉండేవి. కానీ నేటి తరం యంగ్ హీరోయిన్లు ఆ పాత పద్ధతులకు స్వస్తి పలికారు. తమ లవ్ లైఫ్, బోయ్‌ఫ్రెండ్స్ విషయంలో ఎలాంటి దాపరికాలు లేకుండా... అత్యంత బోల్డ్‌గా .. ఓపెన్‌గా ఉంటూ సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో దాచడం కంటే.. తాము ఎవరితో ప్రేమలో ఉన్నారో బహిరంగంగానే చూపించడమే బెటర్ అని ఫీలవుతున్నారు. ఈ జాబితాలో అందరికంటే ముందు వరుసలో నిలుస్తుంది అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్ పహారియాతో జాన్వీ కపూర్ రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు చాలా కాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయంలో జాన్వీ ఎప్పుడూ దాపరికం లేకుండా ఓపెన్‌గానే ఉంటోంది. జాన్వీ స్నేహాలకు బోనీ కూడా అడ్డు చెప్పడం లేదు. శిఖర్ తమ కుటుంబంతో కలిసి ఉంటే చాలా ఆనందంగా ఉంటుందని ఆయన బహిరంగంగానే అంగీకరించారు. జాన్వీ–శిఖర్ ఇద్దరూ కలిసి తిరుపతి శ్రీవారి దర్శనానికి వెళ్లడం, విదేశీ వెకేషన్లలో చెట్టాపట్టాలేసుకుని తిరగడం నెటిజన్లను ఆకర్షిస్తోంది. తాజాగా జాన్వీ ధరించిన ఒక నైట్ టీషర్ట్‌పై –తప్పిపోతే దయచేసి శిఖర్ వద్దకు తీసుకెళ్లండి– అని రాసి ఉన్న క్యాప్షన్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఇది చూసాక.. ఈ యంగ్ పెయిర్ ఒకరంటే ఒకరు పడిచస్తారు.. అందుకే తొందరగా పెళ్లి చేసుకుంటే బావుంటుందని సెలవిస్తున్నారు నెటిజనులు. మరో యంగ్ బ్యూటీ బుల్లితెర నటి శ్వేతా తివారీ కుమార్తె పాలక్ తివారీ కూడా తన ప్రేమ విషయంలో వార్తల్లో నిలుస్తోంది.

సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్‌తో పాలక్ బహిరంగంగా షికార్లు చేస్తూ అతడితో అత్యంత సన్నిహితంగా మెలుగుతోంది. వీరిద్దరూ కలిసి సైఫ్ ఇంట్లోనే పలు ఈవెంట్లలో... పార్టీలలో జంటగా కనిపిస్తూ కెమెరాలకు చిక్కుతున్నారు. అయితే పాలక్ తివారీ తండ్రి (శ్వేతా మాజీ భర్త) మాత్రం ఈ స్నేహాలను, ప్రేమాయణాలను తీవ్రంగా విభేధిస్తున్నట్లు సమాచారం. ముందుగా ప్రేమ కన్నా కెరీర్ ముఖ్యం అని.. సినిమాల్లో నిలదొక్కుకోవడంపైనే పూర్తి దృష్టి సారించాలంటూ ఆయన పాలక్‌కు గట్టిగానే క్లాస్ తీసుకోవడంపై చర్చ సాగుతోంది.ఇక గ్లామర్ భామలు తారా సుతారియా, అనన్యా పాండే సైతం తమ బోయ్‌ఫ్రెండ్స్ గురించి ఎప్పుడూ దాపరికం లేకుండా ఓపెన్‌గా ఉంటూ ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. వారు ఎవరితో డేటింగ్‌లో ఉన్నారనే విషయాన్ని దాచకుండా అటు ఇంటర్వ్యూలలో, ఇటు సోషల్ మీడియా పోస్టలలో చాలా క్యాజువల్‌గా ప్రతిదీ చెప్పేస్తుంటారు. ఇటీవలే బ్రేకప్ లు అయ్యాక ప్రస్తుతం ఈ ఇద్దరూ సింగిల్ స్టేటస్ ని ఆస్వాధిస్తున్నారు. వీరికి తోడు సీనియర్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ సైతం ఇటీవల సినిమా రచయిత రాహుల్ మోడీతో ప్రేమాయణం సాగిస్తుండటం బాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది. ఈ జంట కూడా ఎక్కడా లుకలుకలు లేకుండా తమ రిలేషన్‌ను హుందాగా ముందుకు తీసుకెళ్తోంది. వీరందరిలా కాకుండా కాస్త భిన్నమైన శైలిని అవలంబిస్తోంది స్టార్ హీరోయిన్ కృతి సనన్. కృతి కొన్నేళ్లుగా తన బోయ్‌ఫ్రెండ్‌ను ప్రపంచానికి నేరుగా పరిచయం చేయకుండా దాచేస్తున్నా.. అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా కొన్ని క్రేజీ లీకులు ఇస్తూ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.

# జన నాయగన్' ఇక డౌటే!



తమిళనాడు ముఖ్యమంత్రి అలాగే దళపతి విజయ్ జోసెఫ్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా నటించిన లాస్ట్ సినిమాన్స్ జన నాయగన్. దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ సినిమా గ్రాండ్ గా ఈ పాటికే విడుదల కావాల్సి ఉంది. బాలయ్య సూపర్ హిట్ భగవంత్ కేసరి కి రీమేక్ గా తెరకెక్కించిన ఈ సినిమా పలు మార్లు వాయిదాలు మీద వాయిదాలు పడింది.సరే విజయ్ సీఎం అయ్యాక ఇక లైన్ క్లియర్ అయ్యిందని అనుకుంటే అసలు ఈ సినిమా విడుదల ఎప్పుడు అనేది సస్పెన్స్ గా మిగిలిపోయింది. ఇక నేడు విజయ్ పుట్టినరోజు అయినప్పటికీ సినిమా మేకర్స్ నుంచి అర్ధ రాత్రి సమయంలో అయినా ఓ అప్డేట్ ని అభిమానులు ఆశించారు. కానీ మేకర్స్ నుంచి ఎలాంటి సౌండ్ లేదు. సో జన నాయగన్ థియేట్రికల్ రిలీజ్ డౌటే అనుకోవాలి. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందించాడు. అలాగే కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహించారు.

# అంతర్జాతీయ వేదికలపై భారతీయ సంగీత విప్లవం!



ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంగీతానికి లభిస్తున్న ఆదరణపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.జూన్ 21 ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంగీతానికి లభిస్తున్న ఆదరణపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గ్లోబల్ మ్యూజిక్ స్టేజ్‌పై భారతీయ కళాకారులు అద్భుతాలు సృష్టిస్తు న్నారని.. మన సంస్కృతి.. సంగీత శైలి ప్రపంచాన్ని అమితంగా ఆకట్టుకుంటోందని ఎంతో గర్వంగా చెప్పుకొచ్చారు. ఒకప్పుడు భారతీయ సంగీతం అంటే కేవలం సినిమా పాటలకే పరిమితమనే భావన ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని శంకర్ మహదేవన్ అభిప్రాయపడ్డారు. సాంప్రదాయ శాస్త్రీయ సంగీతం (క్లాసికల్ మ్యూజిక్) నుండి సమకాలీన ఫ్యూజన్ మ్యూజిక్ వరకు ప్రతి ఒక్క శైలి అంతర్జాతీయ శ్రోతలను అలరిస్తోంది. విదేశీయులు సైతం మన రాగాలు, తాళాల పట్ల ఆకర్షితులవుతుండటం భారతీయ సంగీత సత్తాకు నిదర్శనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతీయ కళాకారుల ప్రతిభకు దక్కిన గౌరవానికి ఇటీవల సాధించిన అవార్డులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. గ్రామీ అవార్డ్స్ వంటి ప్రతిష్టాత్మక వేదికలపై శంకర్ మహదేవన్ భాగస్వామిగా ఉన్న శక్తి బ్యాండ్ సాధించిన విజయం.. ఇతర భారతీయ సంగీతకారుల గ్లోబల్ ప్రదర్శనలు ప్రపంచ వేదికపై మన స్థాయిని మరింత పెంచాయన్నారు. ఈ రకమైన అంతర్జాతీయ గుర్తింపులు యువ తరం మ్యూజీషియన్లకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని శంకర్ మహదేవన్ స్పష్టం చేశారు. భారతీయ సంగీతకారులలో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే? వారికున్న లోతైన శాస్త్రీయ సంగీత పునాది. ఈ బలమైన పునాది వల్లే ప్రపంచంలోని ఏ రకమైన సంగీత శైలితోనైనా సులభంగా కలిసిపోగలరని శంకర్ మహదేవన్ వివరించారు. జాజ్, పాప్, వెస్ట్రన్ క్లాసికల్ వంటి విదేశీ ప్రక్రియలతో మన కర్ణాటక లేదా హిందుస్తానీ సంగీతాన్ని మిళితం చేసినప్పుడు పుట్టే సరికొత్త ధ్వని ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజిక్ లవర్స్‌కు సరికొత్త అనుభూతిని ఇస్తోందన్నారు. ప్రస్తుత డిజిటల్ విప్లవం, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం వల్ల సరి హద్దులనేవి పూర్తిగా చెరిగి పోయాయని శంకర్ మహదేవన్ పేర్కొన్నారు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555